భారాలు ప్రభుత్వమే భరించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజలపై వేసే భారాలను ప్రభుత్వమే భరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం 35వ వార్డు చింతలముని నగర్, గనిగుంతలు, ఈశ్వరప్ప నగర్, శివప్ప నగర్, భగవాన్ నగర్ ప్రాంతాల్లో సిపిఎం ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ నగర కార్యదర్శి టి.రాముడు, కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబు, కె.సుధాకరప్ప, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ బాష, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగప్ప, వ్యకాస నాయకులు కె.వెంకట్రాముడు హాజరయి మాట్లాడారు. గతంలో వాడిన విద్యుత్‌కు ట్రూ అప్ చార్జీల పేరుతో అదనంగా చార్జీలు చెల్లించాలని ప్రభుత్వం రూ.18 వేల కోట్ల భారం ప్రజలపై మోపుతోందని విమర్శించారు. ఈ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఐదు నెలలవుతున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో చంద్రబాబు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. మద్యం పాలసీ తీసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం షాపులు, బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలను తాగుబోతులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, 18 ఏళ్ల నుంచి మహిళకు నెలకు 1500 ఇవ్వాలని కోరారు. కల్లూరు కాలనీలో రోజూ తాగునీరు వదలాలని, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై గురువారం కర్నూలు కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జె.శ్రీనివాసులు, సూర్యనారాయణ, గోవిందు, మద్దిలేటి, మధు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై 'పోరు'

- నేడు మండల కేంద్రాలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు
- ఆరు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా సాగిన సిపిఎం ప్రజాపోరు యాత్ర
- సమస్యలు తెలుసుకుంటూ.. కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ధరల భారాలు మోపుతుండగా మరో వైపు సమస్యలు పేరుకుపోతున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ, రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుండి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు జోరుగా సాగింది. సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, కరపత్రాలు పంచుతూ సిపిఎం నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. ప్రజాపోరులో భాగంగా గురువారం అన్ని మండల కేంద్రాలతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టనున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 8 నుండి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు జోరుగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో సిపిఎం నాయకులు పర్యటిస్తున్నారు. సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ కరపత్రాలు పంచుతూ సిపిఎం నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటాయి. రాష్ట్రంలో ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ బియ్యం ధరలు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా కిలో రూ.80 దాటాయి. గత ఏడాదితో పోల్చితే 40 శాతం పెరిగాయి. కందిపప్పు రూ.95 నుండి రూ.180కు పెరిగింది. పామాయిల్, వంటనూనె ధరలు 40 శాతం పెరిగాయి. పండగల సందర్భంగాను, రోజువారీ సరుకుల కొనుగోళ్ళలోనూ ధరల ప్రభావం కనిపిస్తోంది. ఈ ధరల పెరుగుదలపై ప్రజాపోరులో ప్రజలకు సిపిఎం నాయకులు అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత ఇసుక ఎక్కడ అనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రకృతి ప్రసాదించిన ఇసుకను ఉచితంగా ఇవ్వాల్సిన ప్రభుత్వాలు దానిని కూడా వ్యాపారంగా చూస్తున్నాయి. తాము అధికారంలో వస్తే ఉచిత ఇసుక విధానం తెస్తామని చెప్పి నేటికీ అమలు చేయడం లేదు. దీనిపైనా ప్రజాపోరులో సిపిఎం నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ భారాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం మోపింది. 2022-23లో వాడిన కరెంటుకు ఈ నెల నుండి 2026 జనవరి వరకు కొన్ని నెలలో 44 శాతం వరకు అదనంగా చెల్లించాలి. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గిస్తామని హామీలిచ్చినా టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతి అలా ఉంచినా, ఇప్పుడు అమాంతంగా 44 శాతం విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేస్తున్నారు. దీనిపై సిపిఎం నాయకులు మండిపడుతున్నారు. గ్రామాలు, వార్డుల్లో ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాల గురించి వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు గుంతల మయంగా మారడం, పేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళు, టిడ్కో ఇళ్ళ కాలనీల్లో కనీస మౌలిక వసతులు కరువవడం, రోడ్లు, మంచినీరు, విద్యుత్, వీధిలైట్లు, డ్రైనేజీల నిర్మాణాలు జరగకపోవడం గురించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలం కావడంపై కూడా సిపిఎం నాయకులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజాపోరు ముగింపులో భాగంగా గురువారం అన్ని మండల కేంద్రాలు, కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేపట్టనున్నారు. ఈ ధర్నాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా, మండల కమిటీలు కోరాయి.

ఆకట్టుకున్న ఆట-పాట-మాట

- కర్నూలులో ఎల్ఐసి కళాజాత
- 'ప్రజాధనం.. ప్రజా వినియోగం కోసం' అంటూ నినాదం

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జోనల్ 13వ మహాసభ బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా 'ప్రజాధనం.. ప్రజా వినియోగం కోసం' అనే నినాదంతో హైదరాబాద్ నుంచి చేపట్టిన కళాజాత బుధవారం కర్నూలుకు చేరుకుంది. ఈ సందర్భంగా కర్నూలు సిక్యాంపు సెంటర్‌లో ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కర్నూలు యూనిట్ కార్యదర్శి ఆర్.సునీయ కుమార్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కళాజాత కన్వీనర్ సుజాత ఆధ్వర్యంలో కళాజాత బృంద సభ్యులు గేయాలు, నాటికలతో ఆలోచింపజేశారు. 'పాడుదమా స్వేచ్ఛా గీతం, ప్రభుత్వ రంగాలే.. ప్రభుత్వ రంగాలు.., ఏమవుతుందో నా దేశం..' వంటి గేయాలను ఆలపించారు. ప్రజల సొమ్ము ప్రజల కొరకు, ఆరోగ్య బీమా, జయహో ఎల్ఐసి ఏజెంట్, హెచ్చరిక హెచ్చరిక నాటికలను ప్రదర్శించారు. డ్రగ్స్ మహమ్మారిని పారదోలాలని ప్రదర్శించిన హెచ్చరిక హెచ్చరిక నాటిక ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్రానికి అండగా నిలుస్తున్నాయని, అలాంటి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. కేంద్రానికి ఎల్ఐసి రూ.లక్షల కోట్ల నిధులను సమకూరుస్తోందని, ఎల్ఐసి ద్వారా ప్రతేడాది రూ.2.50 లక్షల కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. అలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సామాజికంగా వెనుకబడిన వారికి కనీసం నాలుగో తరగతి ఉద్యోగాలు కూడా లేకుండా చేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందన్నారు. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం వామపక్షాలు మాత్రమే పోరాడుతున్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దోచుకుంటున్న శత కోటీశ్వరులు ముందుకు వచ్చేందుకు ప్రభుత్వాలు వారిని ప్రోత్సహిస్తున్నాయని, ఈ విషయంపై ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. ప్రజలు ప్రయివేట్ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెట్టొద్దని సూచించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల ఆస్తులను కాపాడుకోవడం... ప్రజల బాధ్యతనే సందేశాన్ని ఈ కళాజాత ద్వారా అందిస్తున్నారని తెలిపారు. ప్రజల కష్టార్జితం ఎల్ఐసి, బ్యాంకులు, జిఐసి రంగాల్లో దాచుకుంటున్నారని చెప్పారు. ఆ ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ఆ ప్రయత్నాలను తిప్పి కొట్టడం ప్రజలందరి బాధ్యత అని తెలిపారు. రైతులు నష్టపోయినప్పుడు పరిహారం రూపంలో ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు ఆదుకుంటున్నాయని, ప్రయివేట్ బీమా సంస్థలు రైతులను కొల్లగొడుతున్నాయని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడుతూ... నూతన ఆర్థిక విధానాలు వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌పరం చేయాలని కేంద్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని తెలిపారు. ఎల్ఐసిని రక్షించుకోవడం కోసం ప్రజలందరూ అండగా నిలబడాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సోమన్న, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు వెంకట్, రైతు సంఘం నాయకులు శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు నాయకులు నరసింహులు కళాజాతకు మద్దతుగా మాట్లాడారు.

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి.ఎల్‌సి యూనియన్ నాయకులు తిరుపతయ్య

అలరించిన ప్రజానాట్యమండలి కళాకారులు

ప్రజానాట్యమండలి కళాకారులు రాజు, బాలన్న, బతుకన్న, సుంకన్న, సుబ్బరాయుడు, బజారి, మహిళా కళాకారులు సరిత, లక్ష్మిలు 'దేశం ఎటు పోతుందో', ఆవాజ్ దో ఏక్ హై, భారత్ కహం ఏక్ హై, పల్లె కన్నీరు పెడుతుందో.., ప్రతిదీ ప్రయివేట్ ప్రజలపై వెయిట్ రా, మోడీ దొంగల బండి..' అనే పాటలు పాడి ప్రజలను ఆలోచింపజేశారు. బిడి.సుధీర్ రాజు 'దృష్టిని బట్టి కనిపిస్తుంది సృష్టని విన్నావు..' అనే పాటను పాడి వినిపించారు. డైరెక్టర్, కొరియోగ్రాఫర్, వేనమ్మల ఆధ్వర్యంలో మానస, ఉమామహేశ్వరి సహన, నందిని విద్యార్థులు 'మా తుఝే సలాం, వందేమాతరం, పాడుదమా స్వేచ్ఛా గీతం..' అనే గీతాలకు నృత్య రూపకాలను ప్రదర్శించి సభికులను ఆకట్టుకున్నారు.

గీతాలను ఆలపిస్తున్న కళాజాత బృందం

పాటలు పాడుతున్న పిఎన్ఎం కళాకారులు



మాట్లాడుతున్న గౌస్‌దేశాయి

జిల్లా అడిషనల్ ఎస్‌పిగా హుస్సేన్ పీరా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్‌పిగా జి.హుస్సేన్ పీరాను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులను విడుదల చేశారు. పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న ఆయనను కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మినిస్ట్రేషన్ విభాగం)గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

104 ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

అంబేద్కర్ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి పట్టణంలోని పాత బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహం దగ్గర బుధవారం వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల 104 ఉద్యోగులు పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ పాత బకాయిలు చెల్లించకపోతే మాకు కుటుంబాన్ని పోషించడానికి కష్టంగా ఉందని, అప్పులు చేయాల్సి వస్తుందని వారు వాపోయారు. ప్రకతి వైపరీత్యాల సమయంలో కూడా తాము వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సేవలు అందించామని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కూటమి ప్రభుత్వం అయినా మాకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు జిల్లా 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అశోక్, హాసన్, కె. వెంకటేష్ లు సిఐటియు మండల నాయకులు రాజు, రాముడుతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి ఉండాలి: సిఐ

ప్రజాశక్తి- పత్తికొండ

వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పత్తికొండ అర్బన్ సిఐ జయన్న అన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో వాహనాలను సిఐ జయన్న తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఎస్ఐ గోపాల్, కానిస్టేబుల్ ప్రసాద్,మారుతి తదితరులు పాల్గొన్నారు.

మరణించిన వారూ పాఠాలు చెబుతారు

కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

'కేడావరిక్ ఓథ్' చేస్తున్న వైద్య విద్యార్థులు

మరణించిన వారు వైద్య విద్యార్థులకు పాఠాలు చెబుతారని, మృతదేహానికి, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞత తెలపాలని అని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు మెడికల్ కాలేజీలోని అనాటమీ డిపార్టుమెంట్‌లో 'కేడావరిక్ ఓథ్' (మతదేహంపై ప్రమాణం) చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు మృత దేహాలే మొదటి గురువులని ,అందుకే అనాటమీ డిపార్టుమెంట్ లో 'ఇక్కడ మరణించిన వారు జీవించి ఉన్న వారికి పాఠాలు చెబుతారు' అని రాసి వుంటుందన్నారు. వైద్య విద్యార్థులు మృతదేహంపై ప్రాక్టికల్స్ నిర్వహిస్తారని, మానవ శరీరంలో అంతర్గతంగా ఏఏ భాగాలు ఎక్కడెక్కడ వుంటాయి. ఎలా వుంటాయి అని నేరుగా చూడడం, స్పృశించడం ద్వారా తెలుసుకుంటారని అన్నారు. మరణించి కూడా వైద్య విద్యార్థులకి పాఠాలు చెబుతున్న మృతదేహానికి వారి కుటుంబ సభ్యులను గౌరవించడం వారికి కతజ్ఞత తెలపడం వైద్యుల బాధ్యత అని తెలిపారు . అందుకే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ రేణుకదేవి, డాక్టర్ విజయానంద్‌బాబు, అనాటమీ హెచ్‌ఒడి , ప్రొఫెసర్ డాక్టర్ శోభారాణి, అసోసియేట్లు డాక్టర్ ప్రశాంతి ,సోమశేఖర్, విజయలక్ష్మి దేవి, అసిస్టెంట్లు డాక్టర్ అపర్ణ, డాక్టర్ సోనీ ఝాన్సీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈ 14న గురువారం జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదుట జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ కార్మికులకు, ప్రజలకు పిలుపు ఇచ్చారు. బుధవారం నగరంలోనికార్మిక కర్షక భవన్‌లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉల్లి హమాలీ కార్యకర్తల విస్తృత సమావేశం యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.రాముడు అధ్యక్షతన నిర్వహించారు. డి.గౌస్ దేశాయ్, శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి పి .నిర్మల, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ .సాయిబాబా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ట్రూఆఫ్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని ఉచిత ఇసుక అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ జరుగు ధర్నాకు కార్మికులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉల్లిగడ్డల హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌ఫీరా, చిన్నబడేసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

-నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

-అధికారులతో కలిసి కమిషనర్ పర్యటన-కార్తీక దీపోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. బుధవారం నగరపాలక, పోలీసు అధికారులతో కలిసి గాయత్రీ ఎస్టేట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, రాజ్‌విహార్, ఆనంద్ టాకీస్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. కేసి కెనాల్‌వద్ద శుక్రవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను, పాత క్రిష్ణనగర్ రైల్వే బ్రిడ్జి ప్రదేశాన్ని కమిషనర్ పరిశీలించారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి వెడల్పు తగ్గించుటకు, రాజ్ విహార్ నందు వాటర్ ఫౌంటెన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రివద్ద చెట్టుకొమ్మలు తొలగించాలని సూచించారు. ఆనంద్ టాకీస్ వద్ద మరో కూడలి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు సంబంధించి రహదారుల భద్రత కమిటీ సూచనల మేరకు, పలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఆనంద్ టాకీస్ వద్ద మరో కూడలి ఏర్పాటు చేస్తామని, తద్వారా బస్టాండ్ వైపు నుండి వచ్చే వాహనాలు కిసాన్ ఘాట్, వినాయక ఘాట్ వైపునకు మళ్ళించవచ్చన్నారు. ఫలితంగా రాజ్ విహార్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు. కెసి. కెనాల్ వినాయక ఘాట్ వద్ద శుక్రవారం జరిగే కార్తీక దీపోత్సవానికి పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. పాత క్రిష్ణనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగు కాలువ నీరు లీకేజీతో బ్రిడ్జి కింద మురుగు నీరు చేరుతుందనే విషయం తెలిసిన వెంటనే, తాత్కాలి కంగా పరిష్కారించామన్నారు. వారంలో సమస్యను శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, సిఐలు మన్సూరుద్దీన్, హుస్సేన్, ఎంఇ సత్యనారాయణ, డిఇఇలు మనోహర్ రెడ్డి, క్రిష్ణలత ,బిల్డింగ్ సూపర్వైజర్ దామోదర్, బిల్డింగ్ ఇంస్పెక్టర్లు అంజాద్ బాష, దివాకర్, శానిటేషన్ ఇంస్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

డిఆర్ఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగసంఘాల నాయకులు

డిఆర్ఒను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్ నారాయణమ్మను బుధవారం ఉద్యోగ సంఘాల నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎపి జెఎసి చైర్మన్ సిహెచ్ వెంగల్ రెడ్డి , ఎపిఎన్‌జిఒస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వి.దస్తగిరి రెడ్డి, జిల్లా కార్యదర్శి వి.జవహర్‌లాల్, నగర అధ్యక్షులు ఎంసి కాశన్న , ప్రభుత్వ4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మద్దిలేటి, భాస్కర్ రెడ్డి, ఉన్నారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. వీరితోపాటుప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బంగారి, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ సంఘం జిల్లా అధ్యక్షులు రవిప్రకాష్, ఎపిఎన్‌జిఒస్ జిల్లా నాయకులు సాంబశివారెడ్డి, కెసిహెచ్.కృష్ణుడు నగర సంఘం నాయకులు శ్రీనివాసులు ,వరలక్ష్మి, మునీరహమద్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ శేషాద్రి

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- సి బెళగల్

మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయ సేవా సంస్థ అధికారి జస్టిస్ శేషాద్రి పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి,ఎంపిడిఒ రానెమ్మ, సిడిపిఒ వరలక్ష్మి, వెలుగు ఎపిఎం రమేష్‌ల సమక్షంలో వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికలు యువతులు చట్టాలపై అవగాహన ఉంటే ఎదురయ్యే సంఘటనలు ఎదుర్కొనేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్‌లు మనోహర్, హేమలత, వెలుగుసిసిలు , మండల మహిళా సమైఖ్య, గ్రామైక్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

టర్నింగ్ భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

వివాదస్పద ప్రభుత్వ భూమిని తేల్చండి

- ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ క్రాస్ రోడ్డు సమీపంలోని కుంకనూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 591, 597లో ఉన్న వివాదస్పద ప్రభుత్వ భూములను తేల్చాలని పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్ తహశీల్దార్ లోకేశ్వరరావు, రెవెన్యూ సర్వేయర్లను సూచించారు. బుధవారం ఆయన భూములను పరిశీలించారు. కొన్నేళ్లుగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆ సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఆందోళన చేపడుతున్నారు. ఆయా సర్వే నెంబర్లలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్లాట్లను అమ్మారని, ఆ సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని తేల్చాలని ప్రజాసంఘాలు కోరాయి. ఈ మేరకు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ప్రభుత్వ భూములను తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. కొంతలు వేసిన సర్వే నెంబర్లు ప్రభుత్వ భూములు ఉన్నాయో లేదో అధికారికంగా వివరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

రైల్వే లైను భూముల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

భూములను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మండలంలోని దౌల్తాపురం గ్రామ సమీపంలో రైల్వే డబుల్ లైను వేయడానికి ఇచ్చిన భూములను బుధవారం ఇన్‌ఛార్జీ తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ భరత్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైల్వే లైనుకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం మొత్తం అందిందా లేదా అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. రైల్వే లైను పరిధిలో ఉన్న భూములను ఏ ఒక్క రైతూ ఆక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ

తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను, కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎలా చేస్తున్నారని తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారిని ఎక్కువసార్లు తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించేలా చూసుకోవాలన్నారు. మండల సర్వేయర్ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ వీరేష్, విఆర్‌ఒలు గోవిందప్ప, పెద్దన్న, చంద్ర నాయక్, వన్నూరు స్వామి, అంజి, ఎల్‌సి సర్వేయర్ హనుమా నాయక్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్

పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇంతియాజ్‌తో కలిసి బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోని నీటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్‌ఎల్‌సిలో నీటి ప్రవాహం ఉందని, ఆ నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పంపింగ్ ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు. ఫిల్టర్ బెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే దిశగా చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పటిష్టంగా ఉందని, మరిన్ని నీళ్లు నిల్వ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి ఎద్దడికి ఆస్కారం లేకుండా శివారు ప్రాంతాలకు కూడా రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ డిఇ గోపీనాథ్, ఎఇ జనార్దన్ ఉన్నారు.

జిల్లా కమిటీలో డివిజన్‌కు ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ జిల్లా కమిటీలో డివిజన్ ప్రాధాన్యత లభించినట్లు నాయకులు తెలిపారు. ఇటీవల గూడూరులో జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎమ్మిగనూరు ప్రాంతంలోని వివిధ మండలాల్లో పనిచేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యుటిఎఫ్ నాయకులకు జిల్లా కమిటీలో చోటు దక్కడంపై బుధశారం హర్షం వ్యక్తం చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.దావీదు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్.నాగమణి, జె.ఎల్లప్ప, జిల్లా కార్యదర్శులుగా డి.కౌలన్న, గుమ్మలబాబు, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎం.రాజు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్‌గా యు.చంద్రపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కార్మిక, రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కార్మిక, రైతు సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జి.వెంకప్ప, ఎఐఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై ఈనెల 26న జరిగే ర్యాలీ, సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బుధవారం స్థానిక ఆదోని రెవెన్యూ భవన్‌లో అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎఐటియుసి నాయకులు వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వ సంపదలు సృష్టించే కార్మిక వర్గం, ప్రజలకు తిండి పెట్టే రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెనుభారం మోపుతున్నాయని విమర్శించారు. పదేళ్ల నుంచి బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహకాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా భారీ పరిశ్రమలు, గనులు, సముద్ర తీరాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటు పరం చేయడం, మూసివేయడం చేస్తోందని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. భవన నిర్మాణ, హమాలీ, ఆటో, రవాణా రంగం తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమం అమలు చేయాలని, ప్రజలకు భారంగా మారిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎఐఎంఎస్ జిల్లా అధ్యక్షులు రాజు, లక్ష్మన్న, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి ఎంకన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ కార్యదర్శి పిఎస్.గోపాల్, ఐఎఫ్‌టియు నాయకులు అఖిల, రసూల్, నరేష్, కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి అసెంబ్లీకి వెళ్లాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆలూరు ప్రాంతంలోని వేదవతి ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు కేటాయించకపోవడం అన్యాయమని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, హనుమంతు విమర్శించారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో అత్యంత వెనుకబడి, కరువు కాటకాలకు నిలయంగా ఉన్న ఆలూరు నియోజకవర్గానికి వేదవతి ప్రాజెక్టు సంజీవని లాంటిదని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు గత వైసిపి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా వేదవతి ప్రాజెక్టుకు నిధుల కేటయింపుల్లో అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాజకీయ విభేదాలతో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అసెంబ్లీకి వెళ్లకపోవడమంటే.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజల ఆశలపై నీళ్లు చల్లడమేనని విమర్శించారు. ఆలూరు తాలూకాలో ఇప్పటికీ పరిష్కారం కానీ అనేక సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వేదవతి ప్రాజెక్టు, అసంపూర్తిగా ఉన్న నగరడోన రిజర్వాయర్, హంద్రీనీవా ద్వారా పంట కాలువల ఏర్పాటు, దేవరగట్టులో జింకల పార్కు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి సమస్యలను లేవనెత్తి నిధులను రాబట్టాలని కోరారు. సిపిఎం నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - కౌతాళం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అమ్రేష్

మండలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపిలు బుజ్జి స్వామి, లిఖిత, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికను వినిపించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగ మల్లయ్య మాట్లాడుతూ... హాల్వి ఎస్‌ఎస్ ట్యాంకుకు నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఎంఇఒ శోభారాణి మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసి ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలని కోరారు. ఎపిఒ మాధవ్ శంకర్ మాట్లాడుతూ... రైతులకు గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వాటిని నిర్మించుకొని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌అండ్‌బి ఇన్‌ఛార్జీ ఎఇ సాయి సురేష్ మాట్లాడుతూ... వివిధ రోడ్లకు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, పనులు వేగవంతం జరిగేలా చూస్తామని తెలిపారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ... గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడుతూ... వివిధ శాఖ అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపడతామని, ఎవరూ వలసలు వెళ్లరాదని తెలిపారు.

తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. సర్వసభ్య సమావేశంలో ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది మండలంలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తుంగభద్ర నది వరద నీరు 100 టిఎంసిలు సముద్రం పాలవుతోందని తెలిపారు. ఈ నీటిని రైతులకు అందించాలని కోరారు. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించడానికి నిధులు మంజూరు చేసిందని, మన ప్రభుత్వం కూడా రైట్ కెనాల్ కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నీటితో జిల్లాలోని పశ్చిమ ప్రాంతమంతా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. రైతుసంఘం నాయకులు ఈరన్న, ఉలిగయ్య, రామదాసు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి

- యురేనియం తవ్వకాలపై ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నాం

- అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రజల పోరాటం నేపథ్యంలో యురేనియం తవ్వకాలపై ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామని, ప్రజలకు మరింత భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని అఖిలపక్ష రాజకీయ పార్టీలు పేర్కొన్నాయి. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం దగ్గర అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి నరసరావు అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, టిడిపి నాయకులు మల్లికార్జున గౌడ్, వెలమకూరు సర్పంచి భాస్కర్, జనసేన నాయకులు నందు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులు, రైతుసంఘం నాయకులు సూరి మాట్లాడారు. యురేనియం తవ్వకాల వార్తల నేపథ్యంలో మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురై ఉధృతమైన పోరాటం చేశారని తెలిపారు. ఆయా గ్రామాల దగ్గర రాస్తారోకోలు, నిరసనలు చేపట్టారని, కలెక్టరేట్ ముట్టడి నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారని చెప్పారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అన్ని వర్గాల ప్రజలు, పౌర సమాజం ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలు తమ తమ స్థాయిల్లో ప్రజలకు అండగా నిలిచే ప్రయత్నం చేశాయని చెప్పారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాలు లభ్యత కోసం కానీ, పరిశీలన కోసం కానీ ఎలాంటి తవ్వకాలూ జరపబోమని ప్రభుత్వం పేర్కొంటోందని చెప్పారు. ప్రభుత్వం శాశ్వతంగా ఇక్కడ ఎలాంటి తవ్వకాలు ఉండవని ప్రజలకు భరోసా కల్పించే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. పోరాటంలో అండగా నిలిచిన మీడియా, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువకులు, మహిళలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి వామపక్షాల నాయకులు, జిల్లా కేంద్రంలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు పలికాయని చెప్పారు. భవిష్యత్తులో మండలంలోని సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించేందుకు ఈ పోరాటం స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. రాబోయే రోజుల్లో అందరూ కలిసి మండల సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని చెప్పారు. నాయకులు గిడ్డయ్య గౌడ్, యూసుఫ్, అశోక్, కౌలుట్ల, కృప, కృష్ణ, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - హోళగుంద

వెన్నెల అనే అనాథ విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థిని వెన్నెల తల్లిదండ్రులు సంవత్సరం క్రితం మృతి చెందారు. చిన్నాన్న సోమశేఖర్, పిన్ని కామాక్షి పెంపకంలో పెరుగుతోంది. తల్లిదండ్రులు లేరని అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బిడ్డను వీపుపై వాతలు తేలేలా ఉపాధ్యాయుడు శేఖర్ చితకబాదారు. చిన్నాన్న, పిన్నిలు ఎంఇఒ సత్యనారాయణకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎంఇఒ ఉపాధ్యాయులనే వెనకేసుకొచ్చినట్లు వారు తెలిపారు. 'ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయి. సర్దుకు పోవాల'ని నచ్చజెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 'మీ బిడ్డనైతే ఇలా కొట్టుకుంటారా' అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాధికారులు స్పందించి ఉపాధ్యాయుడు శేఖర్‌పై చర్యలు తీసుకోకపోతే కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు విద్యార్థిని స్థానిక ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకెళ్లారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈశ్వర్

పట్టణంలోని దీక్షా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈశ్వర్ జాతీయస్థాయి పుట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో అండర్–19 ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి పుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పట్టణంలోని ఇంద్రానగర్‌కు బోయ ఈశ్వర్ సత్తా చాటారు. డిసెంబర్ మొదటి వారంలో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం విద్యార్థి ఈశ్వర్‌ను విద్యార్థులు, సిబ్బంది, పట్టణ క్రీడాకారులు అభినందించారు. ఈశ్వర్ తల్లిదండ్రులు నాగరాజు, లక్ష్మిలు కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. క్రీడాకారుడు ఈశ్వర్ మాట్లాడుతూ... తమది పేద కుటుంబమని, అయినా తమ తల్లిదండ్రులు తనను చదివి స్తున్నారని, క్రీడలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆడడం మానలేదన్నారు. తనకు వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్న కోచ్ మాబుసాబ్, పిఇటి నరసింహ రాజు, వైఎఫ్‌సి సభ్యులు సర్తాజ్, సుభాన్‌లు కఠోర శ్రమ, ఆటలోని మెళకువలను నేర్పించారని తెలిపారు.

పంచాయతీ ఖజానాకు రూ.2 లక్షలు జమ

ప్రజాశక్తి - ఆలూరు

'పంచాయతీలో రూ.6 లక్షలు స్వాహా' అనే శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం వార్త ప్రచురితమైంది. గత మూడు రోజుల క్రితం పంపించిన రూ.2 లక్షలు బుధవారం ఆలూరు మేజర్ పంచాయతీ ఖజానాకు జమ చేసినట్లు తెలిసింది. మిగిలిన మొత్తం ఎప్పుడు జమ అవుతుందని ఇఒ ప్రభాకర్‌ను వివరణ కోరగా... తనకేం తెలియదంటూ అమాయక మాటలు చెప్పడం నిర్లక్ష్యానికి నిదర్శనం. పంచాయతీలో జమ కావాల్సిన నిధులను వాడుకున్న అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడతానన్నారు. చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కృష్ణమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

- మాజీ కౌన్సిలర్ మారుతి

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మకు నామినేటెడ్ పదవి కేటాయిస్తూ సముచిత స్థానం కల్పించాలని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మారుతి కోరారు. బుధవారం ఆయన కృష్ణమ్మను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2004 నుంచి నియోజకవర్గంలో పార్టీకి ఎన్నో సేవలు చేస్తూ కార్యకర్తలకు అండగా ఉంటున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అధికార పార్టీ ఆగడాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ధైర్యంగా నిలిచారన్నారు. 2004లో కౌన్సిలర్, సర్పంచి స్థానాలకు అభ్యర్థులను నిలిపి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి ఎపి ఫుడ్ కమిషన్‌లో సభ్యులుగా పదవి ఇచ్చిందని తెలిపారు. 2024 ఎన్నికల్లో కూటమి తరపున ప్రచారం చేసి ఎమ్మెల్యే పార్థసారథి, ఎంపీ బస్తిపాటి నాగరాజు గెలుపు కోసం కృషి చేశారన్నారు. ఆమె సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించి మరోసారి నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు.

కృష్ణమ్మను కలిసిన మాజీ కౌన్సిలర్ మారుతి

నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

- సిపిఎం సీనియర్ నాయకులు నారాయణ స్వామి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వం వాగ్దానాలు, పథకాలు అమలు చేయాలని సిపిఎం తలపెట్టిన ప్రజా పోరులో భాగంగా గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ప్రజలు, రైతులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి కోరారు. బుధవారం ఆలూరులో ప్రజా పోరు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక ధరలు తగ్గించాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈశ్వర్ గౌడ్, కృష్ణ, విఠల్, గోవర్ధన్, అకీరా నందన్ పాల్గొన్నారు. **హాలహర్విలో** సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడారు. ఆలూరులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. హాలహర్విలో ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు విఠల్, మైనా, అకీరా, రాజశేఖర్ పాల్గొన్నారు.

హాలహర్విలో మాట్లాడుతున్న నాయకులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్

చిప్పగిరి గ్రంథాలయ కార్యాలయంలో ఈనెల 14 (గురువారం) నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. బుధవారం గ్రంథాలయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా, బాలల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ ప్రారంభ వేడుకలు, పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు, ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఎస్‌జి.వెంకట రమణయ్య గురించి స్మరించుకోవడం, రచయితల సందేశాలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులను అందిస్తామన్నారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. **ఆలూరు** ఎంఇఒ కోమలదేవి, ఇఒఆర్‌డి ప్రభాకర్, మొలగవల్లి సర్పంచి మోహన్ రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడుతో కలిసి గ్రంథాలయ అధికారి విజయ్ భాస్కర్ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలను విడుదల చేశారు. వారోత్సవాల్లో బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, క్రీడా పోటీలు, మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయ్ భాస్కర్ తెలిపారు.

ఆలూరులో గోడపత్రిక విడుదల చేస్తున్న ఎంఇఒ కోమల దేవి

శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

ఉన్నత చదువులతోనే గుర్తింపు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉన్నత చదువులతోనే ప్రతి ఒక్కరూ గుర్తింపు పొందుతారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలోని ఆయన స్వగృహంలో యుఎం.బ్రాహ్మణి అనే అభిమాని పుట్టినరోజు సందర్భంగా కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సినీ నటులు నందమూరి బాలకృష్ణ అభిమాని, ఎమ్మిగనూరుకు చెందిన భీమా యూత్ పట్టణ అధ్యక్షులు యుఎం.బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణి, కుమారుడు మోక్షజ్ఞ, ఆయన అన్న కుమారుడు సాయి చరణ్‌తో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో తన కుమార్తె పుట్టినరోజు జరుపుకోవాలని రాంపురం వచ్చినట్లు తెలిపారు. తన కుటుంబానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆయన కుమారులు ప్రదీప్ రెడ్డి, ధరణీధర్ రెడ్డి ఆప్తులని పేర్కొన్నారు. బ్రాహ్మణి కేకు కట్ చేయగా ఎమ్మెల్యే ఆమెకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటర్ చదువుతున్న బ్రాహ్మణి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకుని, సామాజిక గుర్తింపుతో తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

వలసలు వెళ్లొద్దు.. ఉపాధి కల్పిస్తాం : ఎపిఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి కోసం వలసలు వెళ్లొద్దని, గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని ఎపిఒ తిమ్మారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఖగ్గల్లు, రాంపురం గ్రామాల్లో గ్రామసభల ద్వారా ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక కూలి డబ్బుల కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు పిల్లలను వదిలి వెళ్లి అనాథలను చేయవద్దని కోరారు. కొందరు అలా వెళ్లి ప్రాణాలను సైతం పోగొట్టుకున్న విషయం తెలిసిందేనన్నారు. ఉపాధి పనుల కోసం పట్టణాలకు వెళ్లి పిల్లలను చదువుకు దూరం చేయవద్దని హితవు పలికారు. పిల్లల భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు 'ఉరుకుంద' విద్యార్థి

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి ఓంకార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సునీత దేవి, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. గుంటూరు జిల్లాలో రాష్ట్రస్థాయిలో జరిగిన బేస్‌బాల్ పోటీల్లో ఓంకార్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌కు, పదో తరగతి చదువుతున్న ఓంకార్‌కు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

- ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాష

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు కొనసాగిస్తామని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఎస్.షాబీర్ బాష తెలిపారు. బుధవారం పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్‌లో ఉన్న ఎఐవైఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ, సహాయక చర్యలు చేపట్టి, కరువు ప్రాంత విద్యార్థులకు ఫీజులను రద్దు చేయకపోవడం దారుణమని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి అధికంగా వలసలు వెళ్తున్నా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జిల్లాలో విద్యా ప్రమాణ స్థాయి పడిపోతున్న నేపథ్యంలో, నూతన విద్యాసంస్థల నెలకొల్పాల్సిన అవసరం ఉందని, ఉన్న విద్యాసంస్థలను మూసివేసే ధీనస్థితికి దిగజారని మండిపడ్డారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అరకొర సదుపాయాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాఠశాలల్లో, కళాశాలల్లో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ సమస్యలపైన ఎఐఎస్ఎఫ్ జిల్లా 30వ మహాసభల్లో తీర్మానాలు చేశామని తెలిపారు. అలాగే నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షులుగా డి.సోమన్న, ఉపాధ్యక్షులుగా రంగస్వామి (కోడుమూరు), ఈరేష్ (కోసిగి), శ్రీకాంత్ (మద్దికెర), ప్రధాన కార్యదర్శిగా ఎస్.షాబీర్ బాష, సహాయ కార్యదర్శులుగా ఎస్.శరత్ కుమార్ (కర్నూలు), దస్తగిరి (ఆదోని), థామస్ (మంత్రాలయం)తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా 21 మందిని, సమితి సభ్యులుగా 41 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మహారాజశ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S. No. 265/2024

మహమ్మద్ మహబూబ్ షరీఫ్ ...వాది

-VS-

చాకలిరాజు వగైరా ... ప్రతివాదులు

1,2 ప్రతివాదులకు దావా సమన్లు

1) చాకలిరాజు S/o. లేటు సి. సంజన్న, H.No. AN/B48, A.Camp., కర్నూలు.
2) సయ్యద్ షేక్‌షా S/o. సయ్యద్ గౌసు, H.No. 46/86-48A, బుధవారపేట, కర్నూలు.

పై నెంబర్ దావాలో వాది దావా షెడ్యూలు ఆస్తికి సొంత దారుడని తీర్మానము చేయమని, 2) కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపణలు ఉన్న 28-11-2024 తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హారజై తెలుపుకొనవలయును, లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు :
The House Site Land, a plot No. 361 in S.No. 19-1, 336,337, 339 and 340/3A with the extent of 3 cents Situated at B.Thandrapadu Village, Kurnool Mandal and Kurnool Dist. with in the Limits of district registration of Kurnool, Sub Registrator Office of Kurnool bounded by, East : Plot No. 362 Land Site. West - Road, North : Plot No. 380 Land Site. South- Road.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

మహమ్మద్ కిరణ్
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.